

# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 4 మార్చి- 2025 పేజీలు: 24



# ఆత్మరక్షణ శిక్షణ

'రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్' లో విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్

# తల్లికి వందనం.. విద్యకు అ'ధనం'

## మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో బడ్జెట్‌లో ప్రభుత్వ విద్యకు భారీ కేటాయింపులు

విద్యా వ్యవస్థలో దేశానికే ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ దిక్సూచి కావాలన్న మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ సంకల్పాన్ని సాకారం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తాజాగా శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ప్రభుత్వ విద్యారంగానికి ఊతమిచ్చే కీలక నిర్ణయాలు, భారీ కేటాయింపులు ప్రకటించారు.

2025-26 బడ్జెట్లో పాఠశాల విద్యకు రూ. 31,805.65 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 2,506.01 కోట్లు, సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణకు రూ. 1,228.94 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది.

పాఠశాలలకు ఉచితంగా విద్యుత్తు అందించాలని మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు బడ్జెట్ లో రూ.175 కోట్లు ప్రభుత్వం కేటాయించింది.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు 'మన బడి- మన భవిష్యత్తు'కు ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించింది.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యం సరఫరా చేయనున్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం బడ్జెట్లో రూ. 9,407 కోట్లు కేటాయించింది. దీని కింద ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే ప్రతి విద్యార్థి తల్లికీ ఏడాదికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది.



# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 4 మార్చి – 2025 పేజీలు: 24



**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఏ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఏ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**డా. కృతికా శుక్లా,** ఐ.ఏ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య
**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఏ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా
**సలహాసభ్యులు**
**వి.ఎన్.మస్తానయ్య,** డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD – 1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD – 2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, CMO
**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
**సబ్ ఎడిటర్**
**గణేశ్ బెహరా,** PRO
**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. ఎ.సుహాసిని,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**
**డీటీపీ & సహకారం**
**కె.అభిషేక్**
**చిత్రకారులు**
**మల్లిక్ & లక్ష్మణ్**

## బాలికలకు భద్రత.. భరోసా

విద్యార్థినుల విద్యా, విజ్ఞాన, వికాసమే కాదు.. వారి ఆరోగ్యం, భద్రత కూడా ప్రభుత్వం బాధ్యత. బడిలోనూ–బడి బయట సురక్షితంగా, స్వేచ్ఛగా బాలికలు ఉండేలా అన్ని చర్యలూ తీసుకుంటోంది సమగ్రశిక్షా, విద్యాశాఖ.

ఇంట్లో ఉంటే అమ్మానాన్న, కుటుంబం అండగా ఉంటుంది. బడిలో ఉంటే ఉపాధ్యాయులు, సిబ్బంది బాలికలకు బాసటగా నిలుస్తారు. కానీ బయట పరిస్థితులు ఆడపిల్లలకు అభద్రతాభావం కలిగిస్తున్నాయి. పట్టపగలు, బహిరంగ ప్రదేశాల్లోనూ బాలికలపై వేధింపులు, దాడులు జరుగుతున్నాయి.

బాలికల హక్కు అయిన భద్రతను వారికి కల్పించేందుకు అన్ని చర్యలనూ తీసుకున్న ప్రభుత్వం, ఆపద ఎదురైతే తమను తాము రక్షించుకునేందుకు ఆడపిల్లలనే ఆయుధంగా తయారుచేసే ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇప్పిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల కోసం కేంద్రం సహకారంతో రూపొందించిన 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షణ్ పథకం' విజయవంతంగా అమలు జరుగుతోంది. ఈ శిక్షణ కార్యక్రమంతో బాలికలు స్వీయరక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటున్నారు.

అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, మునిసిపల్, సోషల్ వెల్ఫేర్, గిరిజన పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతుల వరకూ విద్యార్థినులకు "రాణి లక్ష్మి భాయ్ ఆత్మ ప్రశిక్షణ్" కార్యక్రమం ద్వారా పది వేలకు పైగా పాఠశాలల్లో 8.55 లక్షలకు పైగా బాలికలకు శిక్షణ ఇస్తున్నాం.

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/ samagrashiksha/ మరియు cse.ap.gov.in

# పతకాల పట్టు వదలని చందన





### జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో 37 పతకాలు సాధించిన కేజీబీవీ విద్యార్థిని

పతకాల పట్టువదలని కేజీబీవీ విద్యార్థిని గుత్తుల మధు చందన వెయిట్ లిఫ్టింగ్ జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో 37 పతకాలు సాధించింది. చింతూరుకు చెందిన గుత్తుల శ్రీనివాస్, పూర్ణిమ కుమార్తె మధుచందన. చింతూరు కేజీబీవీలో ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతోంది.

చిన్నప్పటి నుంచే క్రీడల్లో ఆసక్తి పెంచుకుంది. పేద కుటుంబమైనా, పెద్ద ఆశయాలను కలగంటూ నిత్యసాధనతో రాణిస్తోంది. తాజాగా జరిగిన 68వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్లస్ 87 కేజీ విభాగంలో రజిత పతకం సాధించింది. 2017 నుంచి కోచ్ గోలి గంగాధర్ మార్గదర్శకత్వంలో మధు చందన తన ప్రతిభను మెరుగుపరుచుకుంటూ వెయిట్ లిఫ్టింగ్ లో ఒక శక్తిమంతమైన క్రీడాకారిణిగా ఎదిగింది.

### సాధించిన పతకాలు

* జాతీయ స్థాయిలో అండర్–19 స్కూల్ గేమ్స్ లో కాంస్య పతకం.
* రాష్ట్రస్థాయిలో 18 గోల్డ్, 11 సిల్వర్, 7 కాంస్య పతకాలు.
* సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో అన్ని దశల్లో మెరుగైన ప్రతిభ.

### ఆత్మవిశ్వాసమే అసలు విజయరహస్యం

వెయిట్ లిఫ్టింగ్ లో మధుచందన విజయాలు, సాధించిన పతకాల వెనుక ఆమె కఠోర శిక్షణ, అంతులేని ఆత్మవిశ్వాసం ప్రధానపాత్ర పోషించాయి. వెయిట్ లిఫ్టింగ్ లో రాణించడం వల్ల పతకాలు, ప్రశంసలతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా అదనపు బహుమతిగా అందుకుంది చందన.

### భవిష్యత్తు కోసం బలమైన లక్ష్యాలు

జాతీయ స్థాయిని దాటి, అంతర్జాతీయ వేదికలపై పతకాల సాధించాలని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది. కష్టసాధ్యమైన బరువులు ఎత్తడమే కాదు. పోటీల్లో రాణించి తల్లిదండ్రుల కీర్తి–ప్రతిష్టను ఎంతో ఎత్తుకు తీసుకెళ్లే లక్ష్యం దిశగా సాధన చేస్తోంది చందన.








# ఆటలతో ఆరోగ్యం, ఆనందం.. ఉద్యోగుల్లో ఉల్లాసం, ఉత్సాహం..

## సమగ్ర శిక్షా కార్యాలయంలో 'అందరికీ ఆటలు' కార్యక్రమం

ఉరుకుల పరుగుల జీవితాల మధ్య ఆరోగ్యం పట్ల కాస్త శ్రద్ధ తీసుకోవడానికి కూడా సమయం కుదరట్లేదు. ఉద్యోగులకైతే విధినిర్వహణ, పని ఒత్తిడితో ఆరోగ్యం చిత్తవుతోంది. ప్రభుత్వ–ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారిలో ఎక్కువ మంది వ్యాధుల బారిన పడుతున్నారు. మధుమేహం, రక్తపోటు, అధికబరువు, గుండె సంబంధిత రుగ్మతలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు అధిగమించడానికి ప్రతి రోజూ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, పనివేళలు ముగిశాక కనీసం 30 నిమిషాలైనా ఆటలు ఆడాలని గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు 'అందరికీ ఆటలు' అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగులు ప్రతిరోజూ శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసం కలిగించే ఆటలకు కొంత సమయం కేటాయించేలా పనిచేసే ప్రదేశాల్లో ఆటస్థలాలు ఉంచాలని ఆదేశించిన సీఎం దీనికి తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

సంస్థల్లో ఉద్యోగులు ప్రతిరోజు కనీసం అరగంట అయినా షటిల్, వాలీబాల్ వంటివి ఆడేలా చేయాలని, కార్యాలయం ఆవరణలో స్థలం లేకపోతే టేబుల్ టెన్నిస్ అయినా ఆడాలని 'అందరికీ ఆటలు' కార్యక్రమంలో పేర్కొన్నారు. మహిళలకు చెస్, టెన్నికాయిట్, యోగ, క్యారమ్స్ ఆడేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

### ముందు నుంచే 'సమగ్ర శిక్షా'లో అందరికీ ఆటలు

ముఖ్యమంత్రి చంద్రబాబు గారి సూచనలతో రాష్ట్రంలో చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో అందరికీ ఆటలు కార్యక్రమానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. సీఎం గారి ఆలోచనలకు అనుగుణంగా సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయ ఆవరణలో ముందుగానే అందరికీ ఆటలు ఆరంభమయ్యాయి. ఇక్కడ అటెండర్ నుంచి ఉన్నత అధికారి వరకూ అంతా కలిసి.. కార్యాలయ పనివేళలు ముగిశాక కలిసి మెలిసి ఆడుతున్నారు. కార్యాలయంలోనే ఎవరికీ ఎటువంటి ఇబ్బంది లేని ప్రదేశంలో క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు సిద్ధం చేశారు. ఇక్కడ ఉన్నతాధికారులు నుంచి, అన్ని స్థాయిల ఉద్యోగులు, సిబ్బంది వరకూ తారతమ్యం లేకుండా రోజూ సాయంత్రం





విధులు పూర్తయ్యాక ఉత్సాహంగా ఆడుకుంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ, పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్న సమగ్రశిక్షా రాష్ట్ర కార్యాలయంలోనే అందరికీ ఆటలు కార్యక్రమాన్ని ముందుగానే ఆరంభించిన పథక రాష్ట్ర సంచాలకులు బి శ్రీనివాసరావు కృషి ప్రశంసనీయం. అందరిలో ఒకరై తానూ ఆడుతూ.. ఉద్యోగులు, సిబ్బందిలో ఉల్లాసం నింపుతున్నారు. క్రమం తప్పకుండా ఆడేందుకు వీరంతా ఉత్సాహం చూపుతున్నారు.

## ఆటలతోనే ఆరోగ్యం.. ఆనందం

ఉద్యోగులు పనితో పాటు ఆటలు కూడా ఆడాలి. ఆరోగ్యానికి, ఆటలు మంచివి. శారీరక శ్రమతో పాటు మానసిక వికాసానికీ పనికొస్తుంది. శారీరక శ్రమ ద్వారా మానసిక ఒత్తిడిని



అధిగమించి పనిలో మరింత లీనమై చురుకుదనం కలుగుతుంది. విధి నిర్వహణ అనంతరం ఆడే ఆటలతో అందరికీ ఆరోగ్యం, ఆనందం కలగడంతోపాటు సిబ్బంది మధ్య స్నేహపూర్వక బంధం బలపడుతుంది.

**– బి.శ్రీనివాసరావు** IAS.,.ఎస్పీడీ,
సమగ్ర శిక్షా,

## ఆనందంగా ఆడుతున్నాం



నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. ఇక్కడ ఎనిమిదేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాను. ఉద్యోగులందరికీ ఆరోగ్యంతో పాటు ఉత్సాహాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతో మా ఆఫీసులో క్రికెట్, షటిల్ బ్యాడ్మింటెన్ కోర్టులను సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీ బి.శ్రీనివాసరావు సర్ ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ సాయంత్రం విధులు పూర్తయ్యాక ఆడుతున్నాం. తద్వారా ఫిజికల్ ఫిట్ నెస్ తో పాటు శారీరక శ్రమ, ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది. మా ఆఫీసులో ఏర్పాటు చేసిన కోర్టుల్లో ఉన్నతాధికారులు, చిరుద్యోగులు అని తేడా లేకుండా అందరం స్నేహపూర్వకంగా కలిసి సరదాగా ఆడుతుంటాం.

**– వరదల మోజేస్,** ఆఫీస్ సబార్డినేట్, సమగ్ర శిక్షా.







# ఆలోచనలకు ఆవిష్కరణ రూపం ఆంధ్రప్రదేశ్ అటల్ టింకరింగ్ ల్యాబ్స్



## ప్రయోజనాత్మక ప్రయోగాలు విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు

**సృజనాత్మక ఆలోచనలకు రూపం ఇచ్చే వేదికలుగా నిలుస్తున్నాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ATLs).**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆసక్తిని మరింత పెంపొందించే లక్ష్యంగా, సృజనాత్మకతను ప్రదర్శించే వేదికగా, ప్రయోగాలతో ప్రయోజకులుగా తీర్చేదిద్దే బృహత్తర లక్ష్యాలతో నీతి అయోగ్ (NITI AYOG) అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చాలా స్కూళ్లలో ఏర్పాటు చేశారు. ప్రతి ల్యాబ్ కోసం రూ.10 లక్షలు నిధిని నీతి ఆయోగ్, అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా అందిస్తోంది. ఇందులో యూనిసెఫ్, విగ్యాన్ ఆశ్రమ్, సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యంగా పనిచేస్తున్నాయి.



### ల్యాబ్స్ .. నాలెడ్జ్ హబ్స్

"విద్యార్థుల్లో ఆలోచనల ఊహాశక్తిని ప్రోత్సహించడం ద్వారా వినూత్నమైన భవిష్యత్తుకు బాటలు వేసిన గొప్ప ప్రయాణం — అటల్ టింకరింగ్ ల్యాబ్స్."

విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణలు కీలకమైన పాత్ర పోషిస్తాయి. ఈ సూత్రాన్నే ప్రధాన ఆశయంగా తీసుకుని నీతి ఆయోగ్ (NITI Aayog) లోని అటల్ ఇన్నోవేషన్ మిషన్ (AIM) ఆధ్వర్యంలో 2016లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ATLs) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రం, ఇంజనీరింగ్, టెక్నాలజీ, గణితం (STEM) వంటి రంగాల్లో ఆసక్తిని పెంచి, ఆవిష్కరణా నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ నాలెడ్జ్ హబ్స్ గా నిలిచాయి.

ATL ల్యాబ్ లో విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (IoT), రోబోటిక్స్ (Robotics), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), 3D ప్రింటింగ్, సెన్సార్లు, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ వంటి ఆధునిక సాంకేతికతలపై, సృజనాత్మకతతో ప్రాజెక్టులు చేస్తున్నారు. విద్యార్థుల్లో ప్రయోగాత్మక అధ్యయనం, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, టీమ్ వర్క్ అభివృద్ధి చేయడానికి ATL ఉపయోగపడుతోంది.

### జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

విద్యార్థుల ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు అటల్ టింకరింగ్ మారథాన్ కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. 2024లో జరిగిన స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు 76 ప్రాజెక్టులతో దేశవ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ ప్రాజెక్టుల్లో విద్యార్థులు వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శించారు. విద్యార్థుల్లో ఆవిష్కరణాతత్వాన్ని పెంచేందుకు మేక్-ఎ-థాన్ వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో విద్యార్థులు తాము తయారు చేసిన నూతన ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. వేసవి సెలవుల్లో సమ్మర్ బూట్ క్యాంప్ నిర్వహించి, ఎంపిక చేసిన విద్యార్థులకు సాంకేతిక శిక్షణ అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్యాంపులో శిక్షణ పొందిన విద్యార్థులు తిరిగి తమ స్కూళ్లలోని సహ విద్యార్థులకు శిక్షణ అందించేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్ మార్గదర్శకత్వం వహిస్తోంది.





## రాష్ట్రవ్యాప్తంగా..

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 713 అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఉన్నాయి. అందులో 565 ప్రభుత్వ పాఠశాలలు, 148 ప్రైవేట్ పాఠశాలలు ఈ ల్యాబులను అందుబాటులోకి తెచ్చాయి. ప్రతి ల్యాబ్ ఏర్పాటు కోసం నీతి ఆయోగ్ ద్వారా ప్రారంభంలో ₹10 లక్షల నిధులు మంజూరు చేస్తారు. ఆ తర్వాత ప్రతి సంవత్సరం ల్యాబ్ నిర్వహణ కోసం ₹2 లక్షలు మంజూరు చేస్తారు. మొత్తం ఐదేళ్లలో ₹20 లక్షల నిధులతో ఒక ల్యాబును అభివృద్ధి చేస్తారు. ఈ ల్యాబుల్లో విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్ కిట్స్, 3D ప్రింటింగ్, రోబోటిక్స్, కోడింగ్, సెన్సార్లు, ప్రోగ్రామింగ్ సామగ్రి వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థను అందుబాటులో ఉంచారు.

## హబ్ అండ్ స్పోక్ మోడల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ATLs అమలుకు ప్రత్యేకంగా హబ్ అండ్ స్పోక్ మోడల్ అమలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 30 హబ్ లను ఎంపిక చేసి, ఒక్కో హబ్ కి ఐదు స్పోక్ ల్యాబ్ లను అనుసంధానించారు. ఈ మోడల్ ద్వారా 30 మంది ఉపాధ్యాయులను హబ్ లీడర్లుగా ఎంపిక చేసి, వారిని ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రతి ఏడాది 12 రోజుల పాటు ల్యాబ్ శిక్షణ అందిస్తున్నారు. హబ్ లీడర్లు తమ పరిధిలోని 5 స్పోక్ ల్యాబ్ ల విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు.

## ఉన్నత విద్యామండలితో కలిసి

* అటల్ టింకరింగ్ ల్యాబులు– ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలితో కలిసి 31 ఇంజనీరింగ్ కాలేజీలను 31 ATL హబ్లకు మ్యాప్ చేశారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (JNTU) అనుబంధ ఇంజనీరింగ్ కాలేజీల 2వ నుండి 4వ సంవత్సరం విద్యార్థులు అటల్ టింకరింగ్ ల్యాబులతో కలిసి ప్రాజెక్ట్ లను అభివృద్ధి చేస్తారు. ఇందులో ఒక్కో కాలేజీ నుండి 5 మంది, అటల్ టింకరింగ్ ల్యాబుల్లో ఇన్ స్ట్రక్టర్ గా చేరతారు. ఇదే అటల్ టింకరింగ్ ల్యాబ్ మెంటర్షిప్ ప్రోగ్రామ్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ లో భాగంగా, 2 నెలల ఇంటర్ షిప్ నిర్వహిస్తోంది. ఈ ఇంటర్ షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు యూనిసెఫ్, సమగ్ర శిక్షా నుండి "సర్టిఫికేషన్ ఆఫ్ ఎక్సలెన్స్" అందజేస్తారు.

## విద్యార్థుల ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఇవే

సీడ్ ది ఫ్యూచర్ ఎంట్రప్రెన్యూర్స్ అనే అంతర్జాతీయ పోటీలో ఆంధ్రప్రదేశ్ నుండి నాలుగు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ప్రతి ప్రాజెక్ట్కు ₹21,500 నిధులు ఇస్తారు. 6 నెలల్లో ప్రాజెక్ట్ పూర్తి చేయాలి.

*వరదయ్యపాలెం ZPHS విద్యార్థులు అభివృద్ధి చేసిన రైడ్ సేఫ్ బైక్ భద్రత పరికరం*
*పెనమలూరు zphs విద్యార్థులు తయారుచేసిన ప్యాడీ డ్రైయర్*
*ధర్మవరం ZPHS యూరిన్ కేర్ అనే సైన్స్ ప్రాజెక్ట్*
*కిర్లంపూడి ZPHS విద్యార్థులు వరి పంట సేకరణ యంత్రం*
***2025లో రాష్ట్రంలోని ఐదు కొత్త ప్రాజెక్టులు అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి.***

అటల్ టింకరింగ్ ల్యాబ్స్ విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచనలను తట్టిలేపే వేదికగా మాత్రమే కాకుండా, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సామాజిక సమస్యలకు పరిష్కారాలను వెతికే మార్గదర్శక వేదికగా నిలుస్తున్నాయి. ఈ ప్రయాణం రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్లోని యువ ఆవిష్కర్తలను భారత భవిష్యత్తు ఇన్నోవేటర్లుగా తీర్చిదిద్దే దిశగా ముందుకు సాగుతోంది.

– **అమలాపురపు దుర్గాప్రసాద్**, జర్నలిస్టు

మన రాష్ట్రంలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఎటిఎల్) 565 ప్రభుత్వ సెకండరీ పాఠశాలలలో ఏర్పాటు చేయబడ్డాయి. వీటిని అటల్ ఇన్నోవేషన్ మిషన్ – నీతి ఆయోగ్, భారత ప్రభుత్వం ద్వారా సహాయం అందించడం జరుగుతుంది. వీటిని బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వివిధ కార్యశాలలు నిర్వహించి వారికి తగిన ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది. ఈ అటల్ టింకరింగ్ ల్యాబ్స్ అందరూ ఉపయోగించుకుని మంచి ప్రాజెక్టులను తయారు చేయాలని కోరుకుంటున్నాను.



– **టి. సుదర్శన్,** సలహాదారు – యూనిసెఫ్



# భయం ఎందుకు? కౌన్సెలింగ్ అభయం

• విద్యార్థుల్లో మానసిక స్థైర్యం పెంపొందించేందుకు దేశంలోనే తొలి ప్రయోగం

• పాఠశాలల్లో కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ల నియామకం



తల్లి తిట్టినా... నాన్న కొట్టినా.. మాస్టారు మందలించినా... స్నేహితులు ఎగతాళి చేసినా.. పరీక్షలు ఫెయిలైనా తట్టుకోలేకపోతున్నారు ఈ కాలం పిల్లలు. దానికి తిరుగు జవాబుగా ఆత్మహత్యే శరణ్యమా? ఇంటి నుంచి వెళ్లిపోవడమే పరిష్కారమా? ఈ మధ్య చిన్న చిన్న విషయాలకే చిన్నబుచ్చుకుని, నిండు ప్రాణాలను అర్థాంతరంగా బలి చేసుకుంటున్నారు. చివరికి తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్నారు. బతుకు జీవనాన్ని సాఫీగా నడిపించేలా సరైన మార్గాన్ని, అవగాహనను కల్పించేవారు లేకపోవడం వల్లనే ఇలాంటివి జరుగుతున్నాయి.

అందుకే, విద్యార్థుల బంగారు జీవితాన్ని నిలబెట్టడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ – సమగ్ర శిక్షా భారత దేశంలోనే ప్రప్రథమంగా 'కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ల'ను నియమించి విద్యార్థులను మానసికంగా దృఢంగా తయారు చేసేందుకు కీలకమైన అడుగు వేసింది.

రాష్ట్రవ్యాప్తంగా 255 మంది ప్రత్యేకమైన కెరీర్ &మానసిక ఆరోగ్య కౌన్సెలర్లను నియమిస్తూ, ప్రభుత్వ విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికింది. ఎడ్‌సిల్ సహకారంతో అమలైన ఈ వినూత్న కార్యక్రమం, విద్యార్థుల భవిష్యత్ సవాళ్లను అధిగమించేందుకు, వారి మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు దోహదపడుతుంది. జిల్లా స్థాయిలో పని చేసే ఈ కౌన్సెలర్లు, మాధ్యమిక విద్యాసంస్థలకు అండగా నిలిచి, విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నారు.

## విద్యారంగంలో మార్పునకు నాంది

కెరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్య స్థితికి కౌన్సిలింగ్ కల్పించడం ద్వారా విద్యార్థులు తమ మానసిక బలాన్ని పెంచుకోవడమే కాకుండా, విద్యా ఫలితాలను మెరుగుపరచుకోవచ్చు. సునిశితమైన నిర్ణయ సామర్థ్యం, స్వీయజ్ఞానం, సానుకూల దృక్పథం వంటి విలువలు విద్యార్థుల్లో పెంపొందించి, వారికి దీర్ఘకాల ప్రాధాన్యత కలిగిన జీవన నైపుణ్యాలను అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం.

## కౌన్సెలర్ల కోసం ప్రత్యేక శిక్షణ

ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు, కౌన్సెలర్లకు NIMHAANS నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాల క్యాంపస్ YES–J Excellence Centreలో, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 2025 జనవరి 20–23 తేదీల్లో మూడు రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో NIMHAANS కు చెందిన అదనపు ప్రొఫెసర్ డా. ఇ. అరవింద్ రాజ్, పరిశోధకుడు బి. అశోక్ కుమార్ పాల్గొని, కౌన్సెలర్లకు విద్యార్థుల మానసిక వికాసాన్ని అర్థం చేసుకోవడం, వారికి సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం తదితర కీలక అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ శిక్షణలో భాగంగా చిన్న వస్తువులను ఉపయోగించి నేర్పే పద్ధతులు, పాత్రధారణ (role play) &మాక్ కౌన్సెలింగ్ సెషన్లు, భావోద్వేగాలను బయటపెట్టే క్రియేటివ్ యాక్టివిటీలు, విభిన్న పద్ధతుల ద్వారా కౌన్సెలింగ్‌ను విద్యార్థులకు చేరువ చేసే మార్గాలను వివరించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని సమర్థంగా అంచనా వేయడం, వారిలో ఎదురయ్యే సమస్యలను అర్థం చేసుకోవడం, అవసరమైన చర్యలు తీసుకోవడం వంటి విషయాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందించారు.

unicef








## ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తి

కెరీర్ &మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ విద్యా వ్యవస్థలో భాగం చేసుకోవడం ఎంత ముఖ్యమో, ఆంధ్రప్రదేశ్ ప్రదర్శించిన మోడల్ ద్వారా స్పష్టమవుతోంది. దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థల పునర్నిర్మాణానికి తోడ్పడాలనే దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

## జిల్లా కెరీర్, మానసిక ఆరోగ్య కౌన్సిలర్ల విధులివి

ప్రతి జిల్లా కేంద్రంలో ఇద్దరు జిల్లా కెరీర్, మానసిక ఆరోగ్య కౌన్సిలర్లు ఉంటారు. జిల్లాలో పాఠశాలలను సందర్శించి జిల్లా GCDO & PMU కోఆర్డినేటర్, EdCIL, ఆంధ్రప్రదేశ్ వారికి రిపోర్టు చేస్తారు.

సెకండరీ ,సీనియర్ సెకండరీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్య సహాయం సమగ్ర కౌన్సెలింగ్ అందిస్తారు. ముఖ్యంగా బాలికల భద్రత, అభివృద్ధి, భవిష్యత్ అవకాశాలను బలోపేతం చేయడం ఈ విధానం ప్రధాన లక్ష్యం.

* విద్యార్థుల వ్యక్తిగత ఆసక్తులు, శక్తిసామర్థ్యాలు, కెరీర్ ఆకాంక్షలను అర్థం చేసుకుని వ్యక్తిగత కౌన్సెలింగ్ నిర్వహించడం.
* తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థలతో సమన్వయం చేసి విద్యార్థులకు సరైన కెరీర్ గైడెన్స్ కల్పించడం.
* కెరీర్ అవగాహనపై గ్రూప్ సెషన్లు నిర్వహించడం.
* విద్యార్థుల కెరీర్ అభిరుచులను అంచనా వేసేందుకు సైకోమెట్రిక్ పరీక్షలు నిర్వహించడం.
* విద్యార్థుల సామర్థ్యాలను లిఖితపూర్వకంగా నమోదు చేసి వారి భవిష్యత్ ప్రణాళికకు గైడెన్స్ ఇవ్వడం.
* ఒత్తిడి, డిప్రెషన్, ఆత్మహత్యా ప్రవర్తన, ఆత్మవిశ్వాస లోపం వంటి సమస్యలను ఎదుర్కొంటున్న విద్యార్థులకు వ్యక్తిగత కౌన్సెలింగ్ అందించడం.
* మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు వర్క్ షాప్‌లు, సెమినార్లు నిర్వహించడం.
* అవసరమైన సందర్భాల్లో, ప్రధానోపాధ్యాయుల అనుమతితో విద్యార్థులను ప్రత్యేక నిపుణుల వద్దకు పంపించడం.
* విద్యార్థుల అభివృద్ధిపై సమగ్ర దృష్టితో గ్రామాలు, పట్టణాలు, పేదవర్గ సముదాయాల్లో సందర్శనలు చేసి స్థానిక సమస్యలను అర్థం చేసుకోవడం.
* విద్యార్థులకు మౌలిక వసతుల గురించి అవగాహన కల్పించేందుకు సంబంధిత సంఘాల సహకారం పొందడం.
* కొత్తగా చేరిన లేదా వలస వచ్చిన విద్యార్థులకు కొత్త వాతావరణానికి అలవాటు పడేలా సహాయం చేయడం.
* తరగతి ఉపాధ్యాయులతో సమన్వయం చేసి విద్యార్థుల ప్రవర్తనలోని మార్పులను అర్థం చేసుకోవడం.
* ప్రతి విద్యార్థిపై విశ్వసనీయమైన గోప్యమైన నోట్స్ నిర్వహించడం.
* PMU కోఆర్డినేటర్‌కు విద్యార్థుల పురోగతి, ఎదురయ్యే సవాళ్లు, చేపడుతున్న చర్యలు మొదలైన అంశాలపై నివేదిక సమర్పిస్తారు.

## విద్యావ్యవస్థకు తలమానికం

రాష్ట్రంలో కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సెలర్లను నియమించి భారతదేశంలో మొట్టమొదటి రాష్ట్రంగా చరిత్ర సృష్టించింది. EdCIL, సమగ్ర శిక్షా, AP సహకారంతో ప్రారంభించిన ఈ వినూత్న చొరవ, విద్యార్థులకు నిర్మాణాత్మక కెరీర్ మార్గదర్శకత్వం మరియు మానసిక ఆరోగ్య సహాయాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విప్లవాత్మక మార్పు పాఠశాల విద్యార్థుల శ్రేయస్సును కోరుతుంది.



**– వివిఎస్ఎన్ మూర్తి,** స్టేట్ జీసీడీవో, సమగ్ర శిక్షా

విద్యార్థుల మానసిక ఆరోగ్యం, వారి భవిష్యత్తు గురించి పెరుగుతున్న ఆందోళనలకు తగిన సమయంలో కౌన్సిలర్లను నియమించడం ద్వారా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంది. శిక్షణ పొందిన నిపుణులను అందుబాటులోకి తేవడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో మద్దతు, మార్గదర్శకత్వం ఎంత ముఖ్యమో ప్రభుత్వం గుర్తించింది. పిల్లలు, యువత హక్కులు, శ్రేయస్సును ప్రోత్సహించే యునిసెఫ్ లక్ష్యాలతో ఈ కార్యక్రమం ఊతమిస్తుంది.



**– జి.ప్రియాంక,** *Adolescent Consultant, UNICEF*

ఉత్తరాలు-జీవన పాఠాలు

# నాకే ఎందుకు?

రచయిత: **ఆర్థర్ ఆష్** (1943–1993)

***నేపథ్యం:***

*కొంతమందిలో ఓ విపరీతపు ఆలోచన వుంటుంది. కష్టాలు, కన్నీళ్లు మనకే వున్నాయని, ఇతరులంతా ఆనందంగా వున్నారని... వారు వలపోతుంటారు. ఏదైనా జబ్బు వొస్తే "నాకే ఎందుకు?" అనో... కష్టాలు కలిగితే "మాకే ఎందుకు?" అనో విలపిస్తుంటారు.*

*ఒకప్పుడు ప్రపంచంలో సాటిలేని మేటి టెన్నిస్ ఆటగాడు, వింబుల్డన్ సింగిల్స్ టైటిల్ గెల్చుకొన్న మొట్టమొదటి నల్లవాడు, అమెరికాలో డేవిస్ కప్ కు ఎంపికైన మొదటి నల్ల జాతీయుడు ఆర్థర్ ఆష్ కు ఓ గుండె శస్త్ర చికిత్స సమయంలో ఎక్కించిన రక్తంలోని లోపం వల్ల ఎయిడ్స్ వ్యాధి సోకింది.*

*"అట్లాంటి చెడ్డ వ్యాధి సోకడానికి భగవంతుడు మిమ్మల్నే ఎందుకు ఎన్నుకొన్నాడు?" అంటూ... ఓ అభిమాని రాసిన ఉత్తరానికి జవాబుగా... ఆర్థర్ ఆష్ "నాకే ఎందుకు?" అనే ఈ ఉత్తరాన్ని రాసాడు*

*(ఆర్థర్ ఆష్ తన అభిమానికి రాసిన ప్రత్యుత్తరం)*

✤

50 మిలియన్ల మంది పిల్లలు టెన్నిస్ నేర్చుకోవడం మొదలు పెట్టారు,

5 మిలియన్ల మంది టెన్నిస్ నేర్చుకొన్నారు,

5 లక్షల మంది అందులో నిపుణత సాధించారు,

50 వేల మంది 'సర్క్యూట్' చేరుకొన్నారు,

5 వేల మంది 'గ్రాండ్ స్లాం' చేరుకొన్నారు,

50 మంది వింబుల్డన్ చేరుకొన్నారు,

నలుగురు సెమీ ఫైనల్స్ చేరుకొన్నారు,

ఇద్దరు ఫైనల్స్ చేరుకొన్నారు.

ఫైనల్ గెలిచి నా చేతిలో కప్ పట్టుకొన్నప్పుడు "నాకే ఎందుకు?" అని నేను దేవుణ్ణి ఎప్పుడూ అడగలేదు.

కాబట్టి.... ఇప్పుడు నేను బాధలో వున్నప్పుడు "నాకే ఎందుకు?" అని దేవుణ్ణి నేను ఎలా అడగగలను?

సంతోషం.... మిమ్మల్ని మధురంగా ఉంచుతుంది!

కష్టాలు... మిమ్మల్ని దృఢంగా ఉంచుతాయి!

వేదనలు ... మిమ్మల్ని మానవుడిగా ఉంచుతాయి!

ఓటములు ... మిమ్మల్ని అణుకువగా ఉంచుతాయి!

విజయాలు ... మిమ్మల్ని మెరిసేట్లుగా ఉంచుతాయి!

కానీ... విశ్వాసం ఒక్కటే మిమ్మల్ని ముందుకు సాగేట్లుగా ఉంచుతుంది.

కొన్నిసార్లు... నీ జీవితం నీకు తృప్తినివ్వదు. కానీ, అదే సమయంలో వేరేవాళ్ళు నీలాగా జీవించాలని కలలు కంటుంటారు. ఎగిరే విమానాన్ని చూసి ... ఓ చిన్నపిల్లవాడు నేను ఎగిరితే బాగుండును అని కలగంటాడు. విమానాన్ని నడిపే పైలట్... కింద కనపడే ఫాం హౌస్ చూసి నేనెప్పుడు ఇంటికి వెళ్తానా అని నిట్టూర్పు విడుస్తాడు. జీవితం అట్లా ఉంటుంది!

ఒకవేళ ధనమే తృప్తికి కారణమైతే... ధనవంతులంతా వీధుల్లో నాట్యమాడుతుండాలి. కానీ, ఆ పని పేదపిల్లలే చేస్తారు. నీ జీవితాన్ని ఆనందించు.

ఒకవేళ అధికారమే భద్రత కల్పించేటట్లయితే... వీఐపీ లందరూ... వాళ్ళవెంట గార్డులు లేకుండా తిరగాలి!

ఒకవేళ... అందము, పేరు ప్రఖ్యాతులు... ఆదర్శవంతమైన సంబంధబాంధవ్యాలు తెచ్చేటట్లైతే... ప్రముఖులందరి వివాహ బంధాలు బ్రహ్మాండంగా వుండివుండాలి!

సాదాసీదాగా జీవించు, సంతోషంగా వుండు!

అణకువతో ముందుకు సాగు, మనసారా ప్రేమించు!

✤

*ముగింపు:*

*నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా, తనకు సోకిన జబ్బును దాచిపెట్టుకోకుండా, తన జబ్బు విషయం బాహాటంగా ప్రకటించిన ఆర్థర్ ఆష్ ... Ashe Foundation for the Defeat of AIDS, Arthur Ashe Institute for Urban Health అనే రెండు సంస్థలు స్థాపించి, ఎయిడ్స్ పైన అవగాహన కలిగించడానికి కృషిచేశాడు.*

అనువాదం : **చింతకుంట్ల సంపత్ రెడ్డి,** రిటైర్డ్ లెక్చరర్

98495 01696






# ఆత్మరక్షణ శిక్షణ



## 8,55,498 విద్యార్థినులకు రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షప్రశిక్షణ్'

* మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ తో స్వీయరక్షణ, శారీరక ధృఢత్వం, ఆత్మవిశ్వాసం.



*అమ్మా నేను స్కూలుకి వెళ్లనంటోంది పదోతరగతి విద్యార్థిని సునీత..*

*కారణం స్కూలుకి వెళ్లి వచ్చే తోవలో ఆకతాయిల వేధింపులు..*

*అమలని ప్రేమిస్తున్నానంటూ తిరుగుతున్నాడు ఒక జులాయి. వాడి చేష్టలు తట్టుకోలేక తల్లిదండ్రులు అమలని బడి మానిపించేశారు..*

రాష్ట్రవ్యాప్తంగా బాలికలు చదువులకు దూరం కావడానికి పోకిరీల వేధింపులూ ఒక కారణం అవుతున్నాయి. కొందరైతే బాలికలను వేధించడమే కాదు, దాడి చేసి ప్రాణహాని కలిగిస్తున్నారు. ఆడపిల్లలపై ఈ వేధింపులు, దాడులు బయట జరుగుతాయి. అక్కడ అమ్మానాన్న ఉండరు. టీచర్లు అక్కడికి రాలేరు. పోలీసులూ చేరలేరు. ఈ దాడుల్నించి, వేధింపుల నుంచి బాలికలను రక్షించేది ఎవరు? అంటే ఎవరికి వారే రక్షకులుగా మారాలి అనేది ప్రభుత్వ లక్ష్యం. ఆకతాయిల ఆట కట్టించాలంటే ఆత్మరక్షణ విద్యలో ఆరితేరడమే మార్గం అని ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. తమను తాము రక్షించుకునే ఆయుధాలుగా మార్షల్ ఆర్ట్స్ ద్వారా ఆడపిల్లలను తీర్చిదిద్దే శిక్షణ కార్యక్రమం కేంద్రం సహకారంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు అవుతోంది.

### ఆత్మరక్షణ..ఆత్మవిశ్వాసం

అమ్మాయిలకు భద్రత వారి హక్కు. ఆ హక్కును సమర్థంగా వినియోగించుకోవడానికి, 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షణ్ పథకం' ఒక శక్తివంతమైన అస్త్రంలా రూపుదిద్దుకుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికల కోసం రూపొందించిన ఈ స్వీయ రక్షణ శిక్షణ కార్యక్రమం, బాలికలను భద్రతతో పాటు ఆత్మవిశ్వాసం కలిగినవారిగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమం.

### బడికి దూరం కాకుండా..భద్రంగా..

అన్నిచోట్లా బాలికలపై వేధింపులు, అసభ్య ప్రవర్తన రోజువారీ సమస్యలుగా మారిపోతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల భద్రత గురించి ఆందోళనచెందుతూ, చదువు మాన్పించేస్తున్నారు. ఆటపాటలు ఆగిపోతున్నాయి. ఇంటికి పరిమితంచేసి బయట ప్రపంచానికి దూరం చేస్తున్నారు. దీంతో బాలికలు, చదువులో అంతరాయం ఏర్పడటమే కాకుండా, ఆత్మవిశ్వాసం కోల్పోతున్నారు. ఈ దుస్థితి నుండి బాలికలు బయటపడాలనే సంకల్పంతో 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్' కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా బాలికలు భద్రతగాఉండటంతోపాటు, ధైర్యవంతులుగా తయారవుతారు.

### ఈ పథకం ముఖ్యలక్ష్యాలు:

- బాలికల భద్రత, సాధికారత.
- శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ సమగ్ర విద్యా విధానం.
- బాలికలను సమర్థవంతులుగా తీర్చిదిద్దే నైపుణ్యాభివృద్ధి, భద్రతాశిక్షణ.

### ఎప్పటి నుంచి ఆరంభమైంది అంటే..

స్వీయరక్షణ, భద్రత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో 2016-17 విద్యాసంవత్సరంలో ప్రారంభమైన 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్' లక్షలాది బాలికల జీవితాల్లో వెలుగుని నింపింది. ధైర్యవంతులుగా తీర్చిదిద్దింది. 10,045 పాఠశాలల్లో, 8,55,498 మందికి పైగా బాలికలకు శిక్షణ ఇవ్వడానికి రూ.28 కోట్లు భారీ బడ్జెట్ ను కేటాయించారు.

## మార్షల్ ఆర్ట్స్

ఈ పథకం కింద వివిధ మార్షల్ ఆర్ట్స్ లో బాలికలకు శిక్షణ అందిస్తున్నారు. కరాటే, తైక్వాండో, జూడో, కిక్ బాక్సింగ్, వూషు, కురాష్, సిలంబం, పెన్కాక్ సిలాట్ వంటి మార్షల్ ఆర్ట్స్ లో బాలికల ఆసక్తి మేరకు నిపుణులైన శిక్షకులు ట్రైనింగ్ ఇస్తున్నారు.

* కరాటే, తైక్వాండో శిక్షణ 26 జిల్లాల్లో ఇస్తున్నారు.
* చిత్తూరు, కడప, అనంతపురం, నంద్యాల జిల్లాల్లో జూడో నేర్పుతున్నారు.
* కృష్ణా జిల్లా పాఠశాలల్లో కిక్ బాక్సింగ్ ట్రైనింగ్ సాగుతోంది.
* తూర్పుగోదావరి, గుంటూరు జిల్లాల్లో వూషు, అనంతపురంలో కురాష్, పశ్చిమ గోదావరి సిలంబం, ప్రకాశం జిల్లాలో పెన్కాక్సిలాట్ వంటి ఆత్మరక్షణ విద్యలను విద్యార్థినులకు నేర్పుతున్నారు.

## ఇవీ లక్ష్యాలు..

స్వీయరక్షణ, ప్రమాదకర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం వంటివి ఈ శిక్షణ ప్రాథమిక లక్ష్యాలు. బాలికలు మార్షల్ఆర్ట్స్లో బ్లాక్ బెల్ట్ సాధించడం, మానసిక స్థిరత్వం, శారీరక ఆరోగ్యం మెరుగుపడటం దీర్ఘకాలిక లక్ష్యాలు.

## శిక్షణ ఇలా..

విద్యార్థినులు ఎంచుకున్న మార్షల్ ఆర్ట్స్ 20 సెషన్లలో ట్రైనింగ్ ఇస్తున్నారు. శారీరక నైపుణ్యాలు, మానసిక ధైర్యాన్ని కలిగించే విధంగా ట్రైనింగ్ మాడ్యూల్ రూపొందించారు. ప్రతి బాలికకు శిక్షణ పూర్తయ్యాక ధృవపత్రం అందించి, వారి ప్రతిభను గౌరవిస్తున్నారు. శిక్షణను DEO పోర్ట్ ద్వారా పాఠశాల మ్యాపింగ్, శిక్షణకర్తల ప్రొఫైల్ నమోదు, హాజరు, సెషన్ ఫోటోలు అన్నీ డిజిటల్ మాధ్యమంలో పర్యవేక్షిస్తారు.

సురక్షితమైన, బలమైన, సాధికారతతో కూడిన భవిష్యత్తు వైపు విద్యార్థినులను నడిపించేందుకు 'రాణి లక్ష్మిభాయ్ ఆత్మ ప్రశిక్షణ్' ఉపయోగపడుతుంది. బాలికలపై జరుగుతున్న దాడులు అరికట్టడానికి, ఆడపిల్లలకు ఎలాంటి ఆపద ఎదురైనా భయపడకుండా, ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఎదుర్కొనేందుకు వారిని సుశిక్షితులను చేసే ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతోంది. బాలికలు తమ జీవితాన్ని స్వయంగా, సమర్థంగా తీర్చిదిద్దుకోవడానికి ప్రేరణగా నిలుస్తోంది ఆత్మరక్షణ శిక్షణ. స్వీయరక్షణ అనేది నేర్చుకున్న ఒకనైపుణ్యం మాత్రమే కాదు... అది ఓ ధైర్యం. "ఒక అమ్మాయి తనను తాను రక్షించుకోవడం నేర్చుకుంటే, ఆమె తన కుటుంబాన్ని, సమాజాన్ని, భవిష్యత్తును సాధికారతతో తీర్చిదిద్దగల ఒక శక్తిగా ఎదుగుతుంది.

– **అశ్వతి బాలకృష్ణన్,** *కంటెంట్ క్రియేటర్*

***

సమగ్ర శిక్షా తీసుకొచ్చిన రాణీ లక్ష్మీబాయి

సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రామ్ ద్వారా మేము నేర్చుకున్న సెల్ఫ్ డిఫెన్స్ మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీని ద్వారా మేము బయటకి వెళ్ళినప్పుడు ఏదైనా అపాయం వచ్చినప్పుడు మమ్మల్ని రక్షించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.



మేము నేర్చుకున్న ఈ మూమెంట్స్ మా తోటి విద్యార్థులకు కూడా నేర్పిస్తున్నాం. ఈ ప్రోగ్రాం నిర్వహిస్తున్న అధికారులకు ధన్యవాదాలు

– **కె. దివ్య ప్రసన్న** , *రాజానగరం హై స్కూల్, తూర్పుగోదావరి*

***

ఆకతాయిల నుండి ఎదుర్కోవడానికి అమ్మాయిలకు సెల్ఫ్ డిఫెన్స్ అవసరం. ప్రతి అమ్మాయి సెల్ఫ్ డిఫెన్స్ పై అవగాహన పెంచుకోవాలి. మా పాఠశాలలో సెల్ఫ్ డిఫెన్స్ క్లాసులు నిర్వహించడం వల్ల మాకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.



– **ఎం సుప్రజ,** *ఎనిమిదో తరగతి, సి సెక్షన్, జెడ్పీ హెచ్ఎస్, పి. గన్నవరం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.*

***

సెల్ఫ్ డిఫెన్స్ వల్ల మాలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. శారీరక దృఢత్వం, ధైర్యం ఉంటుంది. మనల్ని మనం రక్షించుకోవడానికి సెల్ఫ్ డిఫెన్స్ కావాలి. పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు.



– **కె. సాహితి,** *9వ తరగతి, జెడ్పీ హెచ్ఎస్, పి. గన్నవరం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా.*

***

పాఠ్యాంశాల్లో ఆత్మరక్షణ కార్యక్రమాలను చేర్చడం ద్వారా, విద్యార్థులకు విద్యాపరమైన అంశాలకు మించి, శారీరక, భావోద్వేగ, సామాజిక శ్రేయస్సును ప్రోత్సహించే సమగ్ర విద్యను అందించగలుగుతాం. స్వీయ-రక్షణ శిక్షణ, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, జీవిత నైపుణ్యాలను నేర్పుతాయి.



– **సి. శ్రీలత,** *ఒకేషనల్ కో ఆర్డినేటర్, సమగ్ర శిక్షా*

***

# నూతన విధానంలో
# క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు

రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణమండలి (SCERT), ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 15.02.2025న రాష్ట్రవ్యాప్తంగా 2809 క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఉపాధ్యాయుల శిక్షణ, విద్యార్థుల ప్రగతి, క్లస్టర్ స్థాయిలో బోధనావ్యూహాలు వంటి అంశాలపై వివిధ సెషన్లు నిర్వహించారు.

### ఈ సమావేశాలలో చర్చించిన ముఖ్యాంశాలివి.

* **సెషన్1:** ఎజెండా పరిచయం, పూర్వసమావేశ సమీక్ష, పాఠశాలలో విద్యార్థుల నమోదుపెంపుదల వ్యూహాలపై చర్చ.
* **సెషన్ 2:** సిలబస్ పూర్తిస్థితి, విద్యార్థుల ప్రగతి విశ్లేషణ, C & D గ్రేడ్ విద్యార్థుల దత్తత ప్రణాళిక,
* 10 వ తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక అమలు, ఉత్తమ ఫలితాల సాధనకు వ్యూహాలు, ప్రాథమిక స్థాయిలో నిపుణ్ లక్ష్యాలు.
* **సెషన్3:** ముఖ్యమైన బోధనావ్యూహాలపై సబ్జెక్టుల వారీగా మోడల్ క్లాసులు (ప్రాథమిక మరియు హైస్కూల్ స్థాయికి ప్రత్యేక శిక్షణలు)
* **సెషన్ 4:** విద్యార్థులలో అభ్యసన ఫలితాల సాధన, వచ్చేనెల బోధనా ప్రణాళిక, క్లిష్టమైన విషయాల బోధనావ్యూహాలు
* **సెషన్ 5:** ఉత్తమ బోధనా పద్ధతులు, పాఠశాల నిర్వహణ వంటి అంశాలపై జాతీయ – అంతర్జాతీయ విజయగాథల వీడియోల ప్రదర్శన – చర్చ.
* **సెషన్ 6:** సమీక్ష, శిక్షణామూల్యాంకనం

గతంలో సగం మంది ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు వెళ్తే, మిగిలిన సగం మంది పాఠశాలను నిర్వహించడంతో రెండు చోట్ల సరైన న్యాయం చేయలేకపోయేవారని, ఫలితంగా రెండు పనిదినాలు నష్టపోయే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం అందరు ఉపాధ్యాయులు ఒకేసారి హాజరవడం వల్ల పనిదినాల నష్టం తగ్గిందని, కాలపట్టిక ప్రకారం సమావేశాలు జరగడం, ప్రతి సెషన్‌కు మోడల్ లెసన్ వీడియోల లింకులు పంపి, ఐ.ఎఫ్.పి ద్వారా చూపించడం ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా మారిందని, పలువురు ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ఆర్జేడీలు, డీఈవోలు, ఏపీసీలు, డిప్యూటీ ఈవోలు, డైట్ ప్రిన్సిపాళ్లు, ఎంఈవోలు, క్లస్టర్ హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు మరియు సమగ్రశిక్ష అధికారులు అందరికీ SCERT డైరెక్టర్ యం.వెంకటకృష్ణారెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇకపై ప్రతి నెల ఇదే విధంగా మూడవ శనివారం మధ్యాహ్నం 1 గంట నుండి 5 గంటల వరకు క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తామని, ఒకవేళ మూడవ శనివారంసెలవు అయితే నాలుగవ శనివారం నిర్వహిస్తామని తెలిపారు.











ఇన్ హౌస్

# ఏపీ విద్యా వ్యవస్థ దేశానికే ఒక మోడల్‌గా తీర్చిదిద్దుదాం

## సమగ్ర శిక్షా ఏపీసీల సదస్సులో పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్షా ఎస్పీడీ

ఏపీ విద్యా వ్యవస్థ దేశానికే ఒక మోడల్‌గా అంతా కలిసి తీర్చిదిద్దుదామని పాఠశాల విద్యా సంచాలకులు వి విజయ రామరాజు, సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావులు పిలుపునిచ్చారు. విజయవాడలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో అన్ని జిల్లాల సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్లు (ఏపీసీలు), సెక్టోరియల్ అధికారులతో రెండు రోజుల పాటు అవగాహన సదస్సు జరిగింది.

ఈ సందర్భంగా పాఠశాల విద్యా సంచాలకులు మాట్లాడుతూ.. వివిధ కార్యక్రమాలకు కేటాయించిన నిధులు సక్రమంగా సకాలంలో ఖర్చు చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తరగతి గది బోధనకు చక్కని ప్రణాళిక వేసుకోవాలని సూచించారు. మన పాఠశాలల్లో మంచి ప్రతిభ ఉన్న విద్యార్థులున్నారని, వారికి చేయూతనందిస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చన్నారు.

సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు మాట్లాడుతూ... విద్యార్థుల్లో పునాది దశ నుంచే అభ్యసన సామర్థ్యాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) పెంపొందించడానికి, విద్యాశాఖ, సమగ్ర శిక్షాలోని ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలన్నారు. ఏపీసీలు నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని సమగ్ర విద్య అందించడంతో పాటు, కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయడానికి కృషి చేయాలన్నారు.

మానవ వనరులశాఖా మంత్రి ఓఎస్డీ ఆకుల వెంకటరమణ మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, భవిష్యత్తులో ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తోందన్నారు. ప్రైవేటు బడిలో చదువుతున్న పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గు చూపేలా ఉపాధ్యాయులు ఆకర్షణీయమైన విద్యను బోధించాలని కోరారు.

రెండు రోజుల కార్యక్రమంలో సీమ్యాట్ డైరెక్టర్ వి.ఎన్. మస్తానయ్య, సమగ్ర శిక్షా ఏఎస్పీడీలు ఎం.ఆర్.ప్రసన్న కుమార్, కె.రవీంద్రనాథ్ రెడ్డి, కేజీబీవీ సెక్రటరీ డి.దేవానందరెడ్డి, శామో అడిషనల్ డైరెక్టర్ కె.నాగేశ్వరరావు, ట్రైనింగ్ కోఆర్డినేటర్ పి.పార్వతి, ఎస్సెస్సీ బోర్డు డైరెక్టర్ డా. కె.వి.శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.









# పిచ్చుకతో స్నేహం (కథ)

అలుగోలు గ్రామంలో రామారావు, శ్రీదేవి దంపతులు ఉండేవారు. దంపతులిద్దరూ కొంత వరకు చదువుకున్నారు. తమకున్న కొద్దిపాటి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వాళ్ళ ఇల్లు ఊరికి కిలోమీటరు దూరంలో ఉండేది. ఆ ఇంటి చుట్టూ పచ్చని పొలాలు, మామిడి తోటలు. వీరికి ఒక్కడే కొడుకు హర్ష. దగ్గరలో గల ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుండేవాడు. హర్షకు పాఠాలన్నా, చదువన్నా విసుగు. ఎప్పుడూ పాఠశాలకు డుమ్మా కొడుతుండేవాడు. పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చేవి. ఒక్కగానొక్క కొడుకు కాబట్టి హర్షను ముద్దుగా తల్లితండ్రులు పెంచారు. గట్టిగా మందలిస్తే ఏం చేసుకుంటాడోనని ఇటు గురువులు అటు తల్లితండ్రులు భయపడిపోయేవారు. ఈ విషయాన్ని అలుసుగా తీసుకున్న హర్ష తనకి నచ్చినట్లు ప్రవర్తించేవాడు. ఐతే స్వభావ రీత్యా హర్ష మంచివాడు. కాలం ప్రభావం వలన కొంచెం దారి తప్పాడు. చెడు సావాసాల వలన చదువుకు దూరంగా, చెడుకి దగ్గరయ్యాడు. నచ్చచెపితే మారతాడు. కోపంగా గాని, గట్టిగా గాని చెబితే వినడు. నెమ్మదిగా చెబితే, అర్థమైనట్లు చెబితే తప్పక వింటాడు. దారికొస్తాడు. ఇది అందరికీ తెలిసిన విషయమే.

నేటి కాలంలోని అందరి పిల్లలు లాగే హర్ష కూడా సెల్ ఫోన్ కి అడిక్ట్ అయ్యాడు. సెల్ ఫోనే లోకం అయిపోయింది. హర్షను దగ్గర నుండి గమనిస్తున్న తల్లితండ్రులకు ఏమి చేయాలో పాలు పోలేదు. రాబోయేది పదో తరగతి. ఈ దశలో ఏం చెప్పినా వినడు. నెమ్మదిగానే కొడుకులో మార్పు తేవాలనుకుని ఒక పథకం వేశారు.



పథకం ప్రకారం ఒకరోజు రామారావు పొలంలో నుంచి కొన్ని వరి కంకులను తెచ్చి ఇంటి చూరికి వేలాడదీసాడు. ఆ తరువాత రోజు ఉదయం ఎక్కడినుండో ఒక పిచ్చుక వరి కంకుల కోసం వచ్చింది. వరి కంకులను తినసాగింది. అక్కడే ఉండి సెల్ చూసుకుంటున్న హర్షకు పిచ్చుక వరి కంకులను తినటం భలే గమ్మత్తుగా అనిపించి వెంటనే తన చేతిలో ఉన్న సెల్ తో ఫోటో తీసి వాట్సాప్ లో స్నేహితలకు పంపాడు. ఫేసుబుక్ లో అప్లోడ్ చేశాడు. ఎక్కడో సెల్ ఫోన్లో పిచ్చుకలు చూడడానికి అలవాటు పడ్డ ఈ తరం హర్ష, హర్ష ఫ్రెండ్స్ కు లైవ్ లో వరి కంకులు తింటున్న పిచ్చుక మహా సరదాగా అనిపించింది. అదే విషయం హర్ష స్నేహితులు వాట్సాప్ ద్వారా తెలియచేసారు. తను పేస్ బుక్ లో పెట్టిన పిచ్చుక ఫోటోకి ఎన్నో లైకులొచ్చాయి. ఈ విషయంలో హర్ష స్నేహితులు హర్షను చూసి అసూయ చెందారు. హర్ష లాగా పిచ్చుక ఫోటో తీసి వాట్సాప్, పేస్ బుక్ లో అప్లోడ్ చేయదలచారు. అందుకు వారు కూడా వాళ్ళ ఇంటి వద్ద వరికంకులు వేలాడదీశారు. కానీ పిచ్చుక రాలేదు.

తర్వాత రోజు హర్ష స్నేహితులు సెల్ ఫోన్లు పట్టుకుని పిచ్చుక ఫోటో కోసం హర్ష ఇంటికి వచ్చారు. సెల్ ఫోన్ పట్టుకుని పిచ్చుక ఫోటో కోసమని కాచుకు కూర్చున్నారు. రోజూ వచ్చిన పిచ్చుక ఆ రోజు రాలేదు. హర్షతో సహ స్నేహితులందరు పిచ్చుక రాకపోవడంతో డీలా పడ్డారు. అప్పుడే పొలం నుంచి వచ్చిన రామారావు వారంతా ఎందుకు అలావున్నారో అడిగాడు. వారంతా రోజు వచ్చిన పిచ్చుక రాలేదని చెప్పారు. దానికి రామారావు "మీరంతా సెల్ ఫోన్ వదిలిపెడితే పిచ్చుక తప్పకుండా వస్తుంది. పిచ్చుకలకు సెల్ ఫోన్లు, సెల్ టవర్ల నుండీ వచ్చే రేడియేషన్ పడదు. మీ చేతిలో ఉన్న సెల్ ఫోన్ వదిలితే పిచ్చుక తప్పక వస్తుంది"అని అన్నాడు. ఆ తరువాత రోజు హర్షతో సహ మిత్రులంతా సెల్ ఫోన్లు వదిలి పిచ్చుకను చూడసాగారు. ఆశ్చర్యం రామారావు చెప్పినట్లే పిచ్చుక వరి కంకులు తినటానికి వచ్చింది. లైవ్లో పిచ్చుకను చూస్తున్న హర్ష, హర్ష మిత్రుల ఆనందానికి అవధులు లేవు.ఆనందంగా ఉన్న హర్ష, హర్ష మిత్రులతో "సెల్ ఫోన్ వాడకం వల్ల పిచ్చుక జాతి నశిస్తున్నది. మీరంతా సెల్ ఫోన్ వాడకం తగ్గిస్తామని మాట ఇవ్వండి. రేపటి నుండీ ఇక్కడ హోంవర్కులు చేసుకుంటూ పిచ్చుకను చూడండి "అన్నాడు. హర్ష, హర్ష మిత్రులంతా అనవసరంగా, ఎక్కువగా సెల్ ఫోన్ వాడమని, పిచ్చుక జాతిని కాపాడతామని రామారావుకి మాటిచ్చి తరువాత కాలంలో ఆ ప్రకారం నడుచుకున్నారు. అలా హర్ష పిచ్చుక కోసమని సెల్ ఫోన్ వాడకం మానేసాడు. నిత్యం హర్ష ఇంటి పట్టునే వుంటూ పిచ్చుకకు వరి కంకులు కడుతూ హోంవర్కులు చేసుకుంటూ బుద్ధిగా చదువుకోసాగాడు. అలా పదో తరగతికి వచ్చాడు. కొంతకాలానికి పిచ్చుక హర్షకు బాగా మచ్చిక అయింది. మచ్చికైన పిచ్చుకతో హర్ష స్నేహం చేసి సెల్ ఫోన్ పూర్తిగా విడిచి పెట్టాడు. పిచ్చుకతో స్నేహం కారణంగా బాగా చదివిన హర్షకు పదో తరగతిలో మంచి మార్కులతో పాసయ్యాడు. పిచ్చుకతో స్నేహం కారణంగా హర్షలో వచ్చిన మార్పుకు, తమ పథకం ఫలించి నందులకు రామారావు, శ్రీదేవిలు ఎంతో సంతోషించారు.

– రాళ్లబండి సంగంనాయుడు,
పాఠశాల సహాయకులు (తెలుగు)
ZPHS, అలుగోలు, నెల్లిమర్ల విజయనగరం 9490935258

## పునాది అక్షరాస్యత సంఖ్యాజ్ఞానం (FLN) శిక్షణ కార్యక్రమంపై పాట

కదలండి... కదలండి
నవ సమాజ నిర్మాతలు
సమాజ శ్రేయస్సులు
జ్ఞాన ప్రకాశాలు.. ఉపాధ్యాయులారా.. కదలండి... కదలండి
ఎన్ ఇ పి ఆదేశించింది
నిపుణ్ భారత్ సూచిస్తుంది
ఎఫ్ ఎల్ ఎన్... పిలుస్తుంది
ప్రథమ్ సంస్థ పలకరిస్తుంది
కదలండి.... కదలండి
ఆరోగ్యం, శ్రేయస్సు, భావాలు వ్యక్తీకరణ
నేర్చుకొనే అభ్యాసం..
ఎన్ ఇ పి లక్ష్యం
అక్షరాస్యత సంఖ్యా జ్ఞానం
పిల్లల సమగ్రాభివృద్ధి యే
ఎఫ్ఎల్ ఎన్ ముందున్న ధ్యేయం
కదలండి.,..... ప్రథం సంస్థ పలకరిస్తుంది
శారీరక సామాజిక
నైతిక మేధోపర
భావోద్వేగ సామర్థ్యాలు ప్రభుత్వ బడుల ఫలాలు
నీతి కథలు క్రీడలు
వేగంగా చదవడం రాయడం
అక్షరాలతో పాటలు
గణితంతో ఆటలు
తరగతి గదుల కృత్యాలు
కదలండి.... ఉపాధ్యాయులారా కదలండి.....



– ***K. ప్రేమ్ కుమార్,*** *ఎస్జీటీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, భట్లూరు, సత్తెనపల్లి మండలం, పల్నాడు జిల్లా, 8374266001*

## పరీక్షలంటే భయమేలా?

పరీక్షంటే శిక్ష కాదు,
శిక్షణలో అదో మెట్టు!
సుశిక్షుతుడవైన నీవు
ఇంకొంచెం సాన బెట్టు
ఒత్తిడి ఏదైనా ఉంటే
ముందుగ పక్కకు నెట్టు.

పరీక్షంటే భయమెందుకు?
భవిష్యత్తుకది వంతెన !
ఇంతటితో ముగిసెకదా,
ఉపాధ్యాయుల తంతు!
భయమెందుకు పద ముందుకు,
మిగిలిందిక నీ వంతు!



ప్రదేశముపై పరిచయాన్ని
ముందుగానే చేసుకో!
ప్రయాణమునకు అవసరమగు
ప్రణాళికలు చేసుకో!
ఆలస్యం లేకుండా ముందుగానే చేరిపో.
ప్రవేశానికి అవసరమగు ప్రతివస్తువు సర్దుకో
ఏ వస్తువు మరవకుండ పరిశీలన చేసుకో!

పరిస్థితులు ఎలాగునున్న పొరపాటులు చేయకు!
పరీక్షలో ముందుండుట కంటె
ప్రవీణత పొందుటే గద ముఖ్యం?

పరీక్షంటే భయపడకిక
ప్రశాంతంగా సాగిపో!!
విజయానికి చేరిపో!!

– ***జి. ప్రభుకుమార్,*** *టీచర్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ముక్కొల్లు, కిర్లంపూడి మండలం,*



## చదువుకున్న బాలిక దీపిక

చదువుకున్న బాలిక
వెలుగునిచ్చు దీపిక
అవనిలో అవుతుంది
నింగిలోని తారక

బాలికలు చదివితే
వృద్ధి చెందు దేశము
గొప్పగా ఎదిగితే
బాగుందు! జీవితము

బాలిక చదవాలోయ్!
ఏలిక కావాలోయ్!
వివక్షత విడిచిపెట్టి
భరోసా ఇవ్వాలోయ్!

వంటింటి కుందేలు
కారాదోయ్! బాలిక
పంజరంలో చిలుక
కాకూడదు బాలిక

– ***గద్వాల సోమన్న,*** *గణితోపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కంబదహాళ్, పెద్దకడబూరు మండలం, కర్నూలు జిల్లా, 9966414680*

## మేజిక్ త్రాసు

త్రాసు తయారు చేయడానికి కావలసిన వస్తువులు:

**4 కర్రముక్కలు, 1చెక్క ముక్క, 2 గిన్నెలు, 3 మర బోల్టులు, గట్టి దారం.**

**చేసే విధానం:**

చెక్క ముక్క మధ్యలో ఒక కర్ర ముక్క నిలువుగా అమర్చాలి. కర్ర పై భాగాన అడ్డుగా కర్రను మరబోల్ట్ తో అమర్చాలి. దానికి రెండు వైపులా త్రాసు గిన్నెలను అమర్చాలి. నిలువు కర్రకు మధ్య భాగంలో ఒకే సైజ్ గల రెండు కర్రలను అమర్చాలి. పై కర్ర కదలకుండా అమర్చాలి. క్రింద కర్ర కదలాడేటట్లు అమర్చాలి.


క్రింద కర్రకు రెండు వైపుల నుండి త్రాసు దండం కర్రకు త్రాడు కట్టాలి.

ఉదాహరణకు: త్రాసుకు రెండు వైపులా మూడు కేజీల రాళ్ళు వేస్తే మధ్యలో రెండు కర్రలు = ఈజ్ ఈక్వల్ టు ఆకారంలో ఉంటాయి.

త్రాసులో ఒక వైపు గిన్నెలో(ఎడమ వైపు)6 కేజీలు, రెండో వైపు గిన్నెలో 2 కేజీలు వేస్తే మధ్యలో ఉన్న రెండు కర్రలు గ్రేటర్ దెన్ '>' ఆకారంలో కనిపిస్తాయి.

త్రాసులో ఒక వైపు గిన్నెలో(కుడి వైపు)6 కేజీలు, రెండో వైపు గిన్నెలో 2 కేజీలు వేస్తే మధ్యలో ఉన్న రెండు కర్రలు లెస్ దెన్ '<' ఆకారంలో కనిపిస్తాయి.

– **ద్వారపురెడ్డి జయరాం నాయుడు** (ఉపాధ్యాయుడు)
MPPS చటాకాయ, కైకలూరు మండలం
ఏలూరు జిల్లా, 9441519570




## ఓ మహిళా మేలుకో

ఓ మహిళా మేలుకో చట్టాన్ని తెలుసుకో
లైంగిక యాసిడ్‌ల నుంచి తప్పించుకో
నిర్భయ చట్టం గూర్చి తెలుసుకో
వ్యభిచార గృహాల నుంచి తప్పించుకో //ఓ మహిళా //

క్షణికావేషాలు మానుకో
భ్రూణ హత్యా చట్టాన్ని తెలుసుకో
బాల్య వివాహాలు మానుకో
నిర్బంధ విద్య నీహక్కని తెలుసుకో //ఓ మహిళా //

వికృత చేష్టలు మానుకో
విడాకులు మానుకో
మంచి లక్షణాలు అలవర్చుకో
జీవితాన్ని సరిదిద్దుకో //ఓ మహిళా //

తలవంచుకు పోయేకాలం చెల్లు
తలయెత్తుకుని వెళ్ళేటట్లు సాధన చెయ్
కళాశాలలో రాగింగ్ లు
నడిరోడ్డులో నరహంతకులు //ఓ మహిళా //

ఎక్కడచూసినా ప్రేమ విఫలం
కత్తిపోట్లు యాసిడ్లు హత్యలు
ఇంకానా ఇకపై చెల్లవని
అందరు ఒకటై తాటతీయాలని
ముందుకు దూసుకు పో

– **ఎం.సుబ్రహ్మణ్యం**, ఎస్.ఏ.(ఇంగ్లీష్) ఆంగ్లోపాధ్యాయుడు
*జి.ప.ఉన్నత.పాఠశాల, బండారుపల్లి, ఏర్పేడు (మండలం), తిరుపతి (జిల్లా) : 7893533367.*

## మీకు తెలుసా?

1. ఆధునిక భోజుడు అని ఎవరిని పిలుస్తారు?
   **కృష్ణదేవరాయలు**
2. శుద్ధి ఉద్యమాన్ని ఎవరు ప్రారంభించారు?
   **దయానంద సరస్వతి**
3. తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేసిన పాకిస్తాన్ అధ్యక్షుడు ఎవరు?
   **అయూబ్ ఖాన్**
4. ఏ క్రికెటర్‌కు హర్యానా హరికేన్ అనే మరో పేరు ఉంది?
   **కపిల్ దేవ్**
5. కేంద్ర ప్రభుత్వ న్యాయ సలహాదారు ఎవరు?
   **అటార్నీ జనరల్**
6. టమోటాలో ఉండే ఆమ్లం ఏది?
   **ఆక్సాలిక్ ఆమ్లం**
7. పసిఫిక్ మహా సముద్రానికి ఆ పేరు ఎవరు పెట్టారు?
   **మాగెల్లాన్**
8. భారతదేశంలో ఏ రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో సినిమా థియేటర్లు ఉన్నాయి?
   **ఆంధ్రప్రదేశ్**
9. భారత జాతీయ జెండాను ఎవరు రూపొందించారు?
   **పింగళి వెంకయ్య**
10. భారత ఎన్నికల సంఘం ఏర్పడింది?
    **25 జనవరి 1950**
11. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవంగా ఏ రోజును పాటిస్తారు?
    **జూలై 15**
12. చేపల శ్వాసకోశ అవయవం ఏది?
    **మొప్పలు**
13. ఊపిరితిత్తుల అధ్యయనాన్ని అంటారు?
    **పల్మనాలజీ**

# చక్కని సంస్కారం

సాయంత్రం ఏడు గంటలు కావస్తున్నా స్కూల్ కి వెళ్ళిన కొడుకు రాముడు ఇంకా ఇంటికి రాలేనందుకు కాస్త కంగారు పడుతూ కాలు కాలిన పిల్లిలా అటూ.. ఇటూ తిరుగుతుంది దుర్గమ్మ. మధ్య మధ్యలో కూతురు శశిని తిడుతూ "ఏం! అన్నని కనిపెట్టుకొని ఉండక్కర్లే? ఇద్దరు ఒకే సైకిల్ మీద కలిసెళ్ళి కలిసొచ్చేటోళ్ళు కదా... ఈరోజు ఏమి వచ్చిందంట? నువ్వు ఒక్కదానివే నీ స్నేహితులతో కలిసొచ్చావ్" అంటూ కూతురి మీద రుసరుసలాడ సాగింది.

"నన్ను తిడతావ్ ఏంటమ్మా? వాడే తనకేదో పనుంది, నువ్వు నీ ఫ్రెండ్స్ తో కలిసి ఇంటికెళ్ళు నేను కాస్త ఆలస్యంగా వస్తానని చెప్పి తన క్లాస్మేట్ శ్రీదేవిని సైకిల్ ఎక్కించుకుని ఎక్కడికో తీసుకునెళ్ళాడు. ఎక్కడికెళ్లాడో నాక్కూడా చెప్పలేదమ్మా..." అంటూ వాపోయింది. "అయినా వాడు ఏం చిన్నపిల్లాడు కాదు. పదో తరగతి చదువుతున్నాడు. నువ్వెందుకు అంతలా గాబరా పడుతున్నావ్" అంటూ ఏడుస్తూ తల్లికి ధైర్యం చెప్పడానికి చూసింది.

కూతురు కళ్ళల్లోంచి నీళ్లు తిరిగేసరికి దుర్గమ్మ మనసు ఉండలేక పోయింది. తన తల్లి మనసు కాస్త మెత్తబడింది. ఏడుస్తున్న తన కూతురిని దగ్గరకి తీసుకుని గుండెలకు హత్తుకుని సముదాయించింది. తన కళ్ళల్లోంచి వస్తున్న కన్నీళ్లను పైట కొంగుతో తుడుచుకుంటూ బాధని తన గుండెల్లోనే అదిమి పట్టుకుంది. తన కన్నీళ్లు చూస్తే పిల్లలు ఇంకా బెంగ పెట్టుకుంటారని ఎప్పుడూ వారి ముందు బయటపడేది కాదు. పిల్లల చిన్నప్పుడే భర్త జబ్బు చేసి చనిపోవడంతో అన్నీ తానై పిల్లలిద్దర్నీ పెంచింది. గారాబం వల్ల చెడిపోతారని కాస్త కటువు గానే ఉండేది పిల్లలతో. అసలే మీ అయ్య లేడు కదా..మిమ్మల్ని పెంచాల్సిన బాధ్యత అంతా నా మీదే పడింది. తల్లైనా, తండ్రైనా నేనే కదా మీకు. అసలే పాడు రోజులు ఎలా ఉన్నాయో సూత్తన్నారు కదా... కాస్త జాగ్రత్తగా ఉండక్కర్లే...జరగరాని తప్పు జరిగిందంటే మనబోటి పేదోళ్ళ బతకనిత్తదా సమాజం. పెద్దోళ్ళు చేస్తే ప్రేమ అంటారు. అదే మన బోటి పేదోళ్ళు సేత్తే తప్పంటారు. కూటికి గతిలేనోడికి ప్రేమలు కావాలా.. ఒళ్ళు కొవ్వెక్కిందా అని దుమ్మెత్తిపోత్తారు. అంటూ కూతురితో తన బాధనంతా వెళ్లగక్కింది.

కొడుకు పైన, తన పెంపకం పైన నమ్మకం ఉన్నా.. పాడు జతలు పట్టి పిల్లాడు చెడ్డ అలవాట్లు ఏమైనా నేర్చుకున్నాడేమోనని ఒకవైపు ఆందోళన చెందుతుంది ఆ తల్లి మనసు. ఆ నోట ఈ నోట వింటున్న వార్తలు గుర్తు చేసుకుని మరీ భయపడ సాగింది. ఎందుకో తన మనసు పరిపర విధాల ఆలోచించి, కీడు సంకోచించడంతో ఉండలేక కన్నీరు జలజలా తన బుగ్గల మీద నుంచి రాలుతూ గుండెల మీద పడుతున్నాయి.

ఇంక ఉండబట్టలేక "శశీ.. నువ్వు లోపలికెళ్లి తలుపేసుకో.. ఎవరొచ్చినా తలుపు తీయొద్దు. జర భద్రం బిడ్డా... నేను ఆ ఎదర సందు వరకు పోయి చూసొత్తాను" అంటూ చేతిలోకి ఓ వెదురు బెత్తం తీసుకుని బయటకి రెండడుగులు వేసిందో లేదో అప్పుడే తన కొడుకు రాముడు ఎదురావడం చూసి ఆగింది. రాముడు కూడా ఆ ఊరి పెద్ద కరణం గారి భార్య పార్వతమ్మ కూడా రావడంతో, ఇంక దుర్గమ్మకి పైప్రాణాలు పైనే పోయాయి. తన కొడుకు ఏదో పెద్ద తప్పు చేసే ఉంటాడు





అందుకే ఆవిడ వీడ్ని వెంట బెట్టుకొచ్చిందని అనుకునే సరికే తన కోపం కట్టలు తెంచుకుంది. కొడుకుని ఏమీ అడక్కుండానే పిచ్చెక్కిన దానిలా తన చేతిలో ఉన్న బెత్తంతో రాముడి వీపు మీద కొట్టింది.

ఆ దెబ్బలు తాళలేక మనసు బరువెక్కి విలవిలలాడుతూ నేనే తప్పు చేయలేదమ్మా..."అంటూ వెక్కివెక్కి ఏడుస్తూ ఆ తల్లి కాళ్ళ మీద పడ్డాడు.

ఇంతలో పార్వతమ్మ దుర్గమ్మ చేతిలోని బెత్తం లాక్కొని" వాడు చెప్పేది వినకుండా అలా గొడ్డును బాదినట్టు బాదుతున్నావ్? నువ్వు అసలు కన్నతల్లివేనా?" అంటూ ప్రశ్నించింది బాధగా... నీ కొడుకు ఏమీ తప్పు చేయలేదమ్మా... ఈరోజు నా బిడ్డ పరువు కాపాడాడు. ఎంత మంచి కొడుకును కన్నావో.. ఎంత సంస్కారంగా, గొప్పగా పెంచేవో కదా... అందుకే నీకు కృతజ్ఞతలు చెప్పడానికి వచ్చానమ్మా..." అంటూ జరిగింది చెప్పింది కరణం గారి భార్య.

ఇంతలో రాముడు అందుకుని "అమ్మా .. నువ్వు నాకు ఎప్పుడూ చెబుతూ ఉంటావు కదా! నా చెల్లిని మాత్రమే కాదు బయట ఆడపిల్లలను కూడా చెల్లి లాగా చూడాలని. ఆ మాటలు మర్చిపోలేదమ్మా..

ఈరోజు సాయంత్రం స్కూలు విడిచి పెట్టే సమయానికి క్లాసులో బెంచి పై తల పెట్టుకుని ఏడుస్తున్న దీపను చూసి ఏమైంది అని అడిగానమ్మా.. తను పొట్టపై చేయి పెట్టుకుని కడుపు నొప్పి వస్తుందని చెప్పడంతో తన సమస్య నాకు అర్థమైంది. తనకి కావలసినవి కొందామని స్కూల్ పక్కన ఉన్న షాపులో అడిగితే అవి లేవన్నారు. అందుకే ఊరి చివరనున్న మెడికల్ షాప్ వరకు వెళ్ళి కొనాల్సి వచ్చింది. నేను వెళ్తున్న సమయంలో శ్రీదేవి పిలిచి తన సైకిల్ పంక్చర్ పడిందని నేను వెళ్లే దారిలోనే వాళ్ళ ఇల్లని అక్కడ దింపమని రిక్వెస్ట్ చేస్తే తన సైకిలు బాగు చేయడానికి ఇచ్చి తనను నా సైకిల్ మీద ఎక్కించుకుని వాళ్ళ ఇంటిదగ్గర దింపానమ్మ అంతే. దీప చెప్పినవి కొని మెడికల్ షాప్ నుంచి మరల స్కూల్ కెళ్ళి తనకి ఇచ్చి వచ్చేసరికి కాస్త ఆలస్యం అయిందమ్మ అంతే. నేనే తప్పు చేయలేదమ్మా.. నన్ను నమ్ము.." అంటూ తల్లిని పట్టుకుని గట్టిగా ఏడ్చేసాడు.

రాముడు తన కూతురు దీపకి చేసిన సహాయం గురించి చెప్పిన పార్వతమ్మ, "ఎంత మంచి సంస్కారం నేర్పించేవు దుర్గమ్మా... అని కృతజ్ఞతలు చెప్పి వెళ్లిపోయింది.

తొందరపడి కొడుకుపై చేయి చేసుకున్నందుకు నొచ్చుకుంది దుర్గమ్మ.. తన పెంపకంలో కొడుకు ఆడపిల్లల్ని గౌరవించే తీరు, సాయంగా నిలవడం తెలుసుకుని గర్వంగా పిల్లలను దగ్గరకు తీసుకుని హత్తుకుంది.

**– పేలూరి వెంకట మీనాక్షి,**

*స్కూల్ అసిస్టెంట్ (హిందీ),*
*జెడ్పీ హెచ్ఎస్, ఎల్.బి.చర్ల, నర్సాపూర్*
*మండలం, 9912601765*






## మారుతి - మ్యాజిక్! (కథ)

చాలాకాలం తర్వాత తిరిగి వచ్చిన మారుతి అనే కోతి ని చూసి అడవిలో ఉన్న కోతులన్నీ ఆనందంతో గంతులేసాయి. తల్లిని చూసి ఆనందంతో ఏడుస్తూ ఎగిరి తన తల్లి మీద ఎక్కి ముద్దాడింది మారుతి. తర్వాత అందరిని ఆప్యాయంగా పలకరించింది. ''అసలు ఏమైపోయావ్?, ఏం జరిగింది?, ఇంత కాలం ఎక్కడ ఉన్నావ్?'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాయి.. కోతులన్నీ ''ఆ విషయాలన్నీ నిదానంగా చెప్తాను ముందు నాకు ఆకలేస్తుంది ఏమైనా ఉంటే పెట్టమ్మా!'' అనగా ''ఇందా ఈ పండ్లు తిను'' అని మామిడి పండ్లు ఇచ్చింది తల్లి పండ్లు తినడం పూర్తయ్యాక ''నేను ఆడుకుంటూ.. ఆడుకుంటూ.. చూసుకో కుండా వేటగాడు వేసిన వలలో చిక్కుకున్నాను వాడు నన్ను తీసుకుని వెళ్లి పట్నంలో ఉన్న ఒక సర్కస్ కంపెనీకి అమ్మేశాడు. అక్కడ సర్కస్ కంపెనీ వారు రోజు నాకు ఆహారం పెట్టి రకరకాల విన్యాసాలు నేర్పించి సర్కస్ లో ఆ విన్యాసాలు చేయించుకునేవారు, ఆ సర్కస్ కంపెనీలో ఉన్న దాని అనే వ్యక్తి కనికట్టు విద్యను నాకు నేర్పించాడు. ''అనగా కనికట్టు విద్య అంటే కోతులన్నీ అర్థం కాకా బుర్ర గోక్కున్నాయ్'' ''కనికట్టు విద్య అంటే ఇంగ్లీషులో మ్యాజిక్ అంటారు దాన్ని నేర్చుకున్నాను ఇదిగో చూడండి!'' అంటూ తన అమ్మ చేతిలో ఉన్న మామిడి పండు ను తీసుకొని మాయం చేసి చూపించింది మారుతి కోతులన్నీ ఆశ్చర్యంతో కూడిన ఆనందంతో కేరింతలు కొట్టాయి. మారుతి నేర్చుకున్న విద్య గురించి అడివంతా తెలిసింది అన్ని జంతువులు దాన్ని పొగడ సాగాయి. దాంతో అప్పటి వరకు తెలివైనది గా గుర్తింపు పొందిన కుందేలు ఈర్ష్య కు అసూయ మొదలైంది. ఎలాగైనా మారుతి నేర్చుకున్న విద్య ద్వారానే దానిని అందరూ అసహ్యించుకునేలా చేయాలని నిర్ణయించుకొని జంతువులన్నీ తెచ్చుకుని, దాచుకున్న ఆహారాన్ని దొంగిలించి మారుతి తన నేర్చుకున్న విద్య ద్వారా ఇతర జంతువుల ఆహారాన్ని మాయం చేస్తున్నాడని ప్రచారం చేయ సాగింది ఈర్ష్య.

విషయం మృగరాజుకి తెలియడంతో వెంటనే మారుతిని విచారించాలి అని ఆదేశించాగా ''ఈరోజు సాయంత్రం రచ్చబండ మీద సమావేశం అందరూ తప్పక రావలెను ఇది మృగరాజు ఆజ్ఞ!'' అంటూ దండోరా వేసింది నక్క.


సాయంత్రం అవగానే అన్ని జంతువులు రచ్చబండ వద్దకు చేరాయి. మృగరాజు మారుతిని విచారించమని నక్కను ఆదేశించగా నక్క ''చూడు మారుతి నీవు పట్నంలో నేర్చుకుని వచ్చిన విద్య ద్వారా ఈ అడవిలో జంతువులు తెచ్చుకున్న ఆహారాన్ని మాయం చేస్తున్నావని అభియోగం దీనికి నీ సమాధానం?'' ''మృగరాజా! నేను నేర్చుకున్న కనికట్టు విద్య కేవలం ఇతరులను ఆనందింప చేయడం కోసం మాత్రమే అంతేగాని దానిని అడ్డుపెట్టుకుని ఇతరులను మోసం చేయడం కోసం కాదు నిజంగా నేను ఏ జంతువు యొక్క ఆహారాన్ని మాయం చేయలేదు అనగా ఇంతలో ఈర్ష్య కలుగ చేసుకుని'' లేదు ఒక రోజు నేను కూడా గమనించాను మారుతి జంతువుల ఆహారాన్ని మాయంచేయడం ''అని అనగా ఇంతలో మృగరాజు కలగజేసుకుని జంతువులు కష్టపడి సంపాదించుకున్న ఆహారాన్ని మాయం చేయడం చాలా తీవ్ర తప్పిదం కనుక దీనికి శిక్ష ఈ అడవి నుంచి బహిష్కరించడం తక్షణం ఈ అడవి నుంచి వెళ్లిపోవాలి'' అని ఆదేశించగా మారుతి మారు మాట్లాడకుండా మౌనంగా అడవిని వదిలి వెళ్ళిపోతుండగా.. ''నువ్వు ఆగు నేను వెళ్ళమంది నిన్ను కాదు!'' అనగానే ఆశ్చర్యంతో వెనక్కి తిరిగి చూసింది మారుతి ''అవును నిన్ను కాదు నేను వెళ్ళమంది కుందేలు ఈర్ష్యని అనగానే గుండెఝల్లుమంది ఈర్ష్య కు ''నేనా నేను దేనికి నేను కాదుగా ఆహారాన్ని మాయం చేసింది?'' అన్నది తనకి ఏమీ తెలియనట్టుగా ఈర్ష్య ''నువ్వు ఆహారాన్ని తీయడం నేనే నా కళ్ళారా చాలాసార్లు చూశాను నీకు తగిన సమయంలో బుద్ధి చెప్పాలనుకున్నాను నువ్వు చేసిన తప్పును భలే తెలివిగా మారుతి మీద వేసావు నీలాంటి నీచబుద్ధి కలిగిన జంతువులు ఈ అడవిలో ఉండడం ప్రమాదకరం వెంటనే వెళ్ళిపో'' అంటూ మృగరాజు గర్జించగా చేసేదిలేక తను చేసిన తప్పుకు బాధపడుతూ ఇకనుంచి ఎప్పుడు ఇటువంటి పనులు చేయకూడదు అని మనసులో అనుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయింది. తను తప్పు చేయలేదని గుర్తించిన మృగరాజుకు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషంగా ఇంటి దారి పట్టింది మారుతి.




*– ఏడుకొండలు కళ్ళేపల్లి APO,*
*సమగ్ర శిక్షా, మచిలీపట్నం, 9490832338*

## దారి కనుక్కోండి చూద్దాం

ఈ అబ్బాయి కోట్ ధరించడానికి వెళ్తున్నారు.
కాస్త దారి చూపిస్తారా ఫ్రెండ్స్



## చుక్కలు కలపండి



# బొమ్మ గీశానోచ్!



***A. సాయి సన్ని,*** *8వ A, MJPAPBCWR పాఠశాల, సింహాచలం*




***యు. గీత శ్రీ*** *10వ తరగతి, ఎస్. కె. వి. టి. ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజమహేంద్రవరం*




***జి.నాగచైతన్య,*** *4వ తరగతి,MPPS SN కాలనీ, అంబాజీపేట మండలం, DR.B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా*





***N.కుసుమ*** *(sgt), GDETMCPS, పటమట, విజయవాడ తూర్పు మండలం, NTR జిల్లా*

## వీరిలో పొడువు ఎవరు ?

ఫ్రెండ్స్ విధి, బాల, కరీనా, జాన్ ఒకే స్కూల్ విద్యార్థులు.
వీరిలో ఎవరు పొడుగ్గా ఉన్నారో చెబుతారా?




## రంగులు వేయండి.



## లక్ష్మీదాసుడు


పూర్వం కీర్తి నగరంలో కనకయ్య అనే వ్యాపారి ఉండేవాడు. అతడు కూరగాయల పండిస్తూ రాత్రి పగలు కష్టపడేవాడు. రైతు బజారుకెళ్లి వ్యాపారం చేసి జీవిస్తుండేవాడు. ఆ వచ్చిన లాభాలతో ఇంటికి కావాల్సినవన్నీ కొని తెచ్చేవాడు. చాలా కాలానికి ఆ పని పట్ల విసుగు, నిర్లక్ష్యం, కోపం పెరిగిపోయాయి. ధనవంతులు చూసినప్పుడల్లా అసూయతో నేను కూడా అలా ఎప్పుడవుతానని కలలు కనేవాడు. ఒక రోజు తీవ్రమైన ఆవేదనతో వెంకటేశ్వర స్వామిని ప్రార్థించాడు. ఆరోజు రాత్రి కలలో వెంకటేశ్వర స్వామి కనబడి ధనవంతుడివి కావాలంటే లక్ష్మీదేవిని ప్రసన్నం చేసుకోవాలని సలహా ఇచ్చాడు. అదే ఆవేదనతో లక్ష్మీదేవిని ప్రార్థించాడు. లక్ష్మీదేవి కనబడగానే తన బాధను చెప్పుకున్నాడు. లక్ష్మీదేవి అంతా విని 'ప్రాప్తం ఉన్నవాడికే అన్ని అనుకూలిస్తుంది నాయనా. నీకు కూడా త్వరలో అనుకూలిస్తుంది. దిగులు పడొద్దని' హితవు చెప్పింది లక్ష్మీదేవి. కానీ కనకయ్య ఆవేశంతో ధనవంతుడు కావాలని మొరాయించాడు. సరేనని లక్ష్మీదేవి 'ఏం కావాలో కోరుకోమంది'. కోటీశ్వరుడు కావాలని కోటి రూపాయలు అనుగ్రహించమని కోరాడు. అలాగే ఇచ్చి మాయమైంది లక్ష్మీదేవి. కొంతకాలంలో తనకు ఉన్న ధనంతో కూరగాయలు పండించాడు. ఒక పెద్ద భవనాన్ని కట్టించుకొని భార్యాబిడ్డలతో హాయిగా కాలం గడపసాగాడు. ఆ సంవత్సరం ఎక్కువ వానలు పడి పంట నష్టం వాటిల్లింది. కానీ అది సహజమని పట్టించుకోలేదు. రెండో సంవత్సరంలో మళ్ళీ అనావృష్టి వల్ల పంట నష్టం వాటిల్లింది. అప్పుడు కూడా పట్టించుకోలేదు. మూడో సంవత్సరం పని వాళ్ళందరూ కష్టపడిన తుఫాను ప్రభావంతో అరకొరగా వచ్చిన నాలుగు డబ్బులు పనివాళ్ళు పట్టుకుపోయారు. తన దగ్గర ఉన్న ధనం అయిపోవడంతో నిరాశతో మళ్ళీ కనకయ్య గుడిసెకు చేరుకున్నాడు. ఆ రాత్రంతా బాధతో ఏడుస్తూ లక్ష్మీదేవి ఆదుకోమని మళ్లీ మొరపెట్టుకున్నాడు. లక్ష్మీదేవి ప్రత్యక్షమైంది. జరిగిందంతా చెప్పుకున్నాడు. ఈసారి లక్ష్మీదేవి నేను అద్భుతమైన పండ్లు ఫలించే విత్తనాలను కొన్ని ఇస్తాను. నీ ఆకలి తీర్చుకోమని చెప్పి మాయమైంది. విత్తనాల మూటను చూసి తన పొలంలో నాటాడు. కొద్ది రోజులకు ఒక పువ్వు పూసింది. దాన్ని సువాసన ఊరంతా వ్యాపించగానే ప్రజలందరూ వచ్చి జరిగింది తెలుసుకొని లక్ష్మి దాసుడని పిలుస్తూ సంతోషించారు. కొందరు ఆడవారు ఆ పువ్వులను కోయగానే అయిష్టంగా భావించాడు. కానీ కోయడానికి ఇష్టం లేకపోయినా వారి నవ్వును, ఆప్యాయతను తలచుకుని పూలను కోసి ఇచ్చాడు. దానితో వచ్చిన కొంత ధనంతో తృప్తిగా జీవించాడు. రోజురోజుకు ఆ పూలు ఎక్కువ అవుతున్న కొద్ది అతనిలో పట్టుదల, శ్రద్ధ ఆ చెట్లపై ప్రేమ పెరిగి జాగ్రత్తగా పెంచుకున్నాడు. కొద్ది రోజులకే ఒక పండు కాసింది. ఆ పండు మాధుర్యానికి, సువాసనకు ఊరంతా వచ్చి అభినందించసాగారు. అలా వారికి తక్కువ ధరకే పండ్లను ఇచ్చి వ్యాపారం చేయసాగాడు. అతని ఆలనా పాలన వల్ల పండ్లు విరివిగా కాసాయి. చుట్టుపక్కల ఊర్లోని వారంతా వచ్చి కొన్నారు. అతని వ్యాపారం మూడు పువ్వుల నుంచి ఆరుపండ్లుగా మారాయి. కొన్ని విత్తనాలను తనతోటి రైతులకు ఇచ్చాడు. అలా ఊరంతా ఆ పండ్లతోటలతో కళకళలాడింది. లక్ష్మీదాసు కథను అందరూ చెప్పుకుంటున్నారు. త్వరలోనే ఆ ఊరి ధనవంతులకు ఇది తెలిసి వచ్చి వ్యాపారం చేశారు. దానితో కనకయ్య లక్ష్మీ దాసుడుగా ఎదిగాడు.


*– **కె.నందిని,** 8వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,*
*వడమాలపేట,తిరుపతి జిల్లా 7702 136344*




# కార్టూ'నిజం'





**ప్రేమ రామచంద్రరావు** (ప్రేమ్ ) SGT టీచర్,
కార్టూనిస్ట్, MPPS కంటకాపల్లి (RS) కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా, 94918 41443

समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్షా

## Scan the QR Code & Follow Samagra Shiksha

**Samagra Shiksha Official (AP)**

Official entity of Department of School Education, Govt. of Andhra Pradesh

- Samagra's Official WhatsApp Channel
- Samagra's Official YouTube Channel
- Samagra's Official Instagram Page
- Samagra's Official Facebook Page
- Samagra's Official X (Twitter)
- Samagra's Official LinkedIn Page

One stop for official Announcements & Initiatives from Andhra's Education Department

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur